
సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 5 । మే । 2024



హరి హర క్షేత్రం.. పుష్పగిరి

జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన పుణ్య క్షేత్రాలలో ఒకటైన పుష్పగిరిలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులు భారీగా తరలి రానున్నారు. - 8లో



కాపు సంక్షేమానికి సీఎం కృషి

కాపు(బలిజ)ల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేశారని రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 350 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	280	451
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 363.320 కిలోలు

న్యూస్‌రీల్

హాకీలో ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్: రాయచోటి రాజు హాకీ అకాడమి ఆధ్వర్యంలో హాకీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హాకీ అకాడమీ జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో చదువుకొనే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పకడ్బందీగా 'ఓట్ ఫ్రం హోమ్'



సిద్దవటంలో ఇంటి వద్దే ఓటు వేస్తున్న వృద్ధుడు

రాజంపేట: రాజంపేట నియోజకవర్గంలో ఓట్ ఫ్రం హోమ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఈ ఓటింగ్ నిర్వహణపై జనరల్ అబ్జర్వర్ ఓం ప్రకాశ్ బంకర్ సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శనివారం రాజంపేట ఆర్‌ఓ మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 165 మంది ఓట్ ఫ్రం హోమ్ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సిద్దవటంలో 27, ఒంటిమిట్ట 39, నందలూరు 19, రాజంపేట 33, వీరబల్లి 24, సుండుపల్లె 23 మంది ఓటర్లు ఈ పరిధిలోకి వస్తారన్నారు.

ఈవీఎంల రెండవ సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

రాయచోటి: ఈవీఎంల రెండవ సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి రెండవ సప్లిమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్‌తో పాటు ఎన్నికల అబ్జర్వర్లు ఓంప్రకాష్ బంకర్, ఎస్ జి మూన్‌లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, డ్వామా పీడీ మద్దిలేటి, ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

చాపాడు: 0–16 ఏళ్ల లోపల ఉండే చిన్నారులకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకా లు తప్పనిసరిగా వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేష్ కుమార్ తెలిపారు. మండలంలోని నక్కలదిన్నె, సీతారామాపురం గ్రామాలలో జరిగిన టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం చాపాడు, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా చిన్నారులకు టీకా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌కుమార్, కావ్య మాధురి, ఓబులేసు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక న్యాయం వైఎస్ జగన్‌తోనే సాధ్యం



వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కరుణాకర్‌రెడ్డి

వేంపల్లె: సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని ఓసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆ సంఘం ప్రతినిధులతో కలిసి వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. అలాగే అక్కడ ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నమస్కరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీదే ఘన విజయమన్నారు. 15రోజుల నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పట్టడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసగించడానికి ఎన్నికల ప్రణాళిక పేరుతో సరికొత్త డ్రామాకు తెరతీశారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు జయవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు గోవిందరెడ్డి, సభ్యులు సుబ్బారెడ్డి, ప్రదీప్ కృష్ణయ్య చౌదరి పాల్గొన్నారు.

నిరుపేదలకు పట్టాభిషేకం!

- ఎన్నో ఏళ్లుగా సొంత భూములు ఉన్నా అమ్ముకోలేని వారికి శాశ్వత హక్కులు
- సీఎం వైఎస్ జగన్ నిర్ణయంతో అందరికీ ప్రయోజనం
- 24,726 మంది రైతులకు చుక్కలు క్లియర్ చేసిన ప్రభుత్వం
- భూమి లేని నిరుపేదలు 2435 మందికి 3276 వేల ఎకరాల భూ పంపిణీ
- 22–ఏలో నిషేధిత జాబితాలో ఉన్న 1,24,859 ఎకరాలకు విముక్తి
- ప్రజల మేలుకోరి ఆలోచన చేసింది ఒక సీఎం వైఎస్ జగన్ మాత్రమే
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో దుష్ప్రచారానికి దిగిన టీడీపీ



జగనన్న భూ రక్ష కార్యక్రమంలో భూమిని సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది(ఫైల్)

సాక్షి, రాయచోటి: భూమిలేని నిరుపేదలు మొదలుకొని అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రయోజనం కల్పించిన ప్రభుత్వమిది. ఎవరైనా సరే ఇబ్బందులు పడుతున్నారంటే వెంటనే స్పందించి న్యాయం చేసే మనసు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. అంతేకాకుండా మానవతా దృక్పథంతో ప్రజలకు, అత్యవసర పరిస్థితుల్లో అండగా ఉండేదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ఎలాంటి అవసరమొచ్చినా సమయానికి స్పందిస్తూ ఆపదలో ఆదుకుంటూ వస్తోంది. ప్రధానంగా రైతులకు సంబంధించి చాలా ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న సర్కార్ భూ వ్యవహారాలకు సంబంధించిన సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కారానికి దారి చూపింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఒకప్పుడు భూమి పంపిణీ జరగ్గా, ప్రస్తుతం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మరొకమారు నిరుపేదలకు భూ పంపిణీ చేపట్టి భూదాతగా నిలిచిపోయారు.

భూమి లేని నిరుపేదలకు అసైన్‌మెంట్ భూములు అందించి ముఖ్యమంత్రి భూదాతగా నిలిచిపోయారు. మరోవైపు 22–ఏలో ఉన్న లక్షలాది ఎకరాలకు విముక్తి కల్పించడం.. చుక్కల భూములకు సంబంధించి సమస్యలను పరిష్కరించి శాశ్వత పరిష్కారం చూపడంతో రైతన్నలు పూర్తి స్థాయిలో సంతోషంగా ఉన్నారు. ఇలాంటి తరుణంలో టీడీపీ కూటమి కుయుక్తులకు తెరతీస్తూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో దుష్ప్రచారం చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తుండటాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

22–ఏలో పెండింగ్‌లో ఉన్న 1,24,859 ఎకరాలకు విముక్తి

జిల్లాలో 22–ఏలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభించక అల్లాడిపోతున్న రైతులకు అప్పట్లో ప్రభుత్వం శుభవార్త చెప్పిందని చెప్పవచ్చు. 22–ఏలో డీకేటీ, ఇతర అనేక రకాల సమస్యలతో కూడుకున్న భూములన్నింటికీ యథావిధిగా ఎవరైతే అర్హులుగా ఉన్నారో వారికే అప్పజెప్పారు. ప్రభుత్వం నుంచి ఈ విధంగా క్లియరెన్సులు రావడంతో సంబంధిత భూ యజమానులకు చెప్పలేని ఆనందం మిగిలింది. జిల్లా వ్యాప్తంగా 61,608 మంది రైతులు 1,24,859 ఎకరాలకు సంబంధించి ప్రయోజనాన్ని అందుకున్నారు.

భూమి లేని పేదలకు పట్టాలు

జిల్లాలో భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం భూ పంపిణీలో భాగంగా పట్టాలను అందించింది. నిరుపేదలకు సంబంధించి ఎవరికి భూమి లేదో వారికి పండించుకునేందుకు వీలుగా ఒక్కొక్కరికి రెండు ఎకరాలు చొప్పున 2435 మందికి 3276 వేల ఎకరాల భూ పంపిణీ చేశారు. గతంలో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో భూ పంపిణీ జరగ్గా, ఆ తర్వాత ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే భూ పంపిణీ చేపట్టారు.

టీడీపీ దుష్ప్రచారం



వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణను చూసి టీడీపీ దుష్ప్రచారానికి తెర తీసింది. ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధి పొందాలన్న ఆలోచనతో ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో సొంత ఆస్తులు ఎగిరి పోతాయంటూ దుష్ప్రచారానికి తెరలేపింది. దీనిపై ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం కూటమి నీచ రాజకీయానికి తెరలేపడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ పలువురికి భూములు పంచేవారేగానీ.. తీసుకునే వారు కాదంటూ రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా ఎన్నికల ముందు టీడీపీ క్షుద్ర రాజకీయాలకు తెర లేపడంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

అన్నమయ్య జిల్లాలో అనేక మందికి ప్రయోజనం



అన్నమయ్య జిల్లాలో లక్షలాది మంది రైతుల భూములకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం దొరికింది. ప్రధానంగా తాతల కాలం నాటినుంచి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న భూమిని అమ్ముకోవడానికి కూడా వీలు లేకుండా ఉండేది. పిల్లల పెళ్లిళ్లు, ఇతర అనేక సమస్యలు వచ్చినప్పుడు కొనుగోలుదారులు కూడా ముందుకు రాకపోవడంతో చుక్కల భూములు కలిగిన రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. ఇలా ఏళ్ల తరబడి సమస్యలతో అల్లాడిపోతున్న చుక్కల భూముల రైతులకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. ప్రధానంగా జిల్లాలో 24,726 మంది రైతులకు సంబంధించి 28,882 ఎకరాల భూమిని క్లియర్ చేసి చుక్కలు లేకుండా ప్రొసీడింగ్స్ ఇవ్వడంతో పూర్తి స్థాయిలో రైతన్నలు ఆనందంలో మునిగిపోయారు.

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

రాయచోటి: ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఈనెల 5, 6 తేదీల్లో జరిగే పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ కోరారు. పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్లకు మే 5న, పోలీసు శాఖ అలాగే 33 అత్యవసర సేవల ఉద్యోగులకు మే 6న పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్‌లో పాల్గొనవచ్చన్నారు. ఏ పరిస్థితుల్లోనైనా 5వ తేదీన ఓటు హక్కు వినియోగించుకోలేకపోయిన వారు 6వ తేదీన ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

హోం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించండి



చెక్‌పోస్టు తనిఖీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్

రామాపురం: జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని నల్లగుట్టపల్లెలో హోం ఓటింగ్ కార్యక్రమాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మండలంలోని మేరదపల్లె చెక్‌పోస్టును తనిఖీ చేసి అక్కడి రిజిస్టర్‌ను పరిశీలించారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రంగస్వామి, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాలు విడుదల

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ 1,3,5,7 సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి తన ఛాంబర్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎర్త్‌సైన్స్ మొదటి సెమిస్టర్‌లో 86.67 శాతం, మూడో సెమిస్టర్‌లో వంద శాతం, 5వ సెమిస్టర్‌లో వంద శాతం, 7వ సెమిస్టర్‌లో వంద శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఐదేళ్ల ఎంఎస్సీ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ పరీక్ష ఫలితాల్లో మొదటి సెమిస్టర్‌లో 92శాతం, మూడు, ఐదు సెమిస్టర్లలో వంద శాతం, 7వ సెమిస్టర్‌లో 82.35 శాతం ఫలితాలు వచ్చాయన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఈ

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార అవార్డు 2025కు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయ స్థాయిలో క్రీడలు, సంఘ సేవ, సైన్స్, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్నమైన సేవలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు అర్హులన్నారు. ఐదేళ్ల నుంచి 18 ఏళ్లలోపు వయస్సుగల వారు అర్హులన్నారు. జులై 31వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీఓవీ.ఇన్/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రధానమంత్రి భద్రతా చర్యల పరిశీలన

కలికిరి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 8న కలికిరిలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయన పర్యటన భద్రతా ఏర్పాట్లను స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) ఎస్పీ అజయ్ సింగ్ శనివారం పరిశీలించారు. పర్యటనలో భాగంగా స్థానిక సైనిక పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలం, సీఆర్‌పీఎఫ్ కేంద్రం ప్రధాన గేటు ముందు 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా స్థలాన్ని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి పరిశీలించి, భద్రతా చర్యలపై సూచనలిచ్చారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీని ఆదేశించారు. ఎస్పీజీ టీం సభ్యులు, రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐ మోహన్ పాల్గొన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీజీ ఎస్పీ

పెనగలూరు అభివృద్ధి బాధ్యత మాది

- పెనగలూరులో భారీ రోడ్‌షో
- హాజరైన వేలాదిమంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



పెనగలూరులో భారీ రోడ్ షోలో పాల్గొన్న ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి తదితరులు



రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన జనం

పెనగలూరు (ఓబులవారిపల్లె): పెనగలూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హామీ ఇచ్చారు. పెనగలూరులో శనివారం ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు పెనగలూరు ఉప సర్పంచ్ చిన్న వెంగల్ రెడ్డి, సీనియర్ నాయకుడు బీఎల్ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో రోడ్డు షో కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ఎంపీ, ఎమ్మెల్యేలు కొండూరు నుంచి నేరుగా దేవూరు చిన్న వెంగల్ రెడ్డి ఇంటికి రాగానే ఘనంగా సన్మానించారు. అనంతరం వినాయకస్వామి ఆలయంలో పూజలు చేసి ఇండ్లూరు మీదుగా బీఎల్ నరసింహారెడ్డి ఇంటివద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్ షో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ వరదలతో పెనగలూరు చెరువుకట్ట తెగిన విషయం గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. కట్ట తెగిన వెంటనే రూ. 1.30 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఈ చెరువు కట్టకు ఎస్టిమేషన్ పూర్తయిందని, ప్రభుత్వం ద్వారా లేదా ఎంపీ నిధుల ద్వారా ఈ చెరువుకట్ట పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ మండలానికి ఏమి అవసరమో ఆ పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఇకపై ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సోమశిల బ్యాక్ వాటర్ నుంచి రూ. 225 కోట్లతో పెనగలూరు, చిట్వేలి మండలాలకు తాగు, సాగునీరు అందించేందుకు శంకుస్థాపన కూడా పూర్తి చేశామన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయన్నారు. ఈ పథకం పూర్తి అయితే రెండు మండలాలు సస్యశ్యామలమవుతాయన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఏమి అవసరమున్నా ఫోన్ చేస్తే వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. రోడ్డుషో అనంతరం నల్లపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డీసీసీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డితో చర్చించారు.

కేతా చక్రపాణికి పరామర్శ: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి తండ్రి మాజీ సర్పంచ్ రామాంజనేయులు శనివారం మృతి చెందారు. స్వగ్రామమైన నారాయణ నెల్లూరు గ్రామానికి ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, దేవూరు చిన్న వెంగల్ రెడ్డి, ధ్వజారెడ్డి తదితరులు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చక్రపాణి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ చిన్న వెంగల్ రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, బత్తిన గుండాల్ రెడ్డి, రెడ్డివారి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ సంక్షేమ పాలన వస్తుంది

- మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ



ఎంపీతో చర్చిస్తున్న కొండూరు ప్రభావతమ్మ

పెనగలూరు (ఓబులవారిపల్లె): రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలన వస్తుందని మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ అన్నారు. శనివారం ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కొండూరు గ్రామానికి విచ్చేశారు, వీరికి వెలగచెర్ల వద్ద రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభావతమ్మ స్వగృహంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మెజార్టీ సీట్లు సంపాదించి మరలా జగనన్న ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. నాయకులు ప్రతాప్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రామిరెడ్డి, ఆంజనేయులు రెడ్డి, సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలస నేతలను నమ్మొద్దు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె: చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఎన్నికల కోసం హైదరాబాదు నుంచి వలస వచ్చారు.. ఎన్నికలు అయిపోగానే మళ్లీ సొంత గూటికి వెళ్లిపోతారు.. అందుకే అలాంటి వారిని నమ్మొద్దు. స్థానికంగా ఉంటూ ప్రజలకు అండగా ఉండేవారికి ఓటు వేయండి.. అని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఓబులవారిపల్లెలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కోవిడ్ కష్టకాలంలో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫామ్ హౌసుల్లో దాక్కున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. నీరు చెట్టు పేరుతో టీడీపీ నాయకులకు దోచిపెట్టారన్నారు. అనంతరం సీనియర్ నాయకుడు ఓజీ శ్రీనివాసులు రెడ్డి స్వగృహంలో అల్పాహారానికి హాజరయ్యారు. . ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సర్పంచ్ ఎస్‌పీ జయపాల్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు టి. కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సినీ ఫొటోగ్రఫీ డిస్ట్రిబ్యూటర్ ఓజీ రఘురామిరెడ్డి, వైస్ ఎంపీపీ కొమ్మూరు నరసింహారెడ్డి,చిత్తూరు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

రైల్వేకోడూరు అర్బన్: నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాజు రెసిడెన్సీలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే వారం రోజులు ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేసి ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో ప్రకటించిన మేనిఫెస్టోను ఐదేళ్లలో అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు, స్థానిక టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు ఎవరూ నమ్మవద్దని కోరారు. 2014లో చంద్రబాబు మేనిఫెస్టో ప్రకటించి దానిని ఏకంగా వెబ్ సైట్‌లో లేకుండా చేసిన చరిత్ర టీడీపీది అన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో ఎంపీ, ఎమ్మెల్యేలు

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మల్లెంపల్లికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు మాచినేని మోహన్ రావు,జయంతి మాల, సుష్మిత, కోటేశ్వర, అశోక్, నాగరాజు, రహ్మతుల్లా, శ్రావణ్ కుమార్, శివ, పరశురాం, వెంకటరమణ తదితరులు పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు.

బత్యాల ఇలాఖాలో వంద కుటుంబాలు..

టీడీపీ నాయకుడు బత్యాల చెంగల్రాయుడు ఇలాఖా అయిన శెట్టిగుంట లక్ష్మీగారిపల్లె అరుంధతివాడకు చెందిన వంద కుటుంబాల వారు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సాయికిషోర్ రెడ్డి, ముప్పాల హేమనవర్మ, తోట శివసాయి, సీహెచ్ రమేష్, అంబటి మురళి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేటు బస్సులో మంటలు



బస్సు కింద మంటలు

బి.కొత్తకోట : కర్ణాటకలోని బెంగళూరు నుంచి బి.కొత్తకోటకు వస్తున్న ఓ ప్రైవేటు బస్సు కింద మంటలు వ్యాపించగా గమనించిన చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తం చేయడంతో ప్రమాదం తప్పిన ఘటన శనివారం జరిగింది. ఉదయం బెంగళూరులో బయలుదేరిన బస్సు చింతామణి నుంచి బట్లపల్లె, కానుగమాకులపల్లె మీదుగా బి.కొత్తకోటకు వస్తోంది. మండలంలోని వడ్రోళ్లపల్లె చెక్‌పోస్టు వద్దకు రాగానే బస్సుకింద మంటలు వ్యాపించడం చెక్‌పోస్టు సిబ్బంది గమనించి బస్సును నిలిపివేయించారు. వెంటనే స్థానికులు, బస్సులోని ప్రయాణికులు మంటలపై నీళ్లు చల్లడంతో ఆరిపోయాయి. బస్సు స్టార్టర్ వైర్, బ్యాటరీ వైర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చేలరేగినట్టు బస్సు సిబ్బంది తెలిపారు. ఎలాంటి ప్రమాదం జరక్కపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాద సమయంలో 40 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్టు తెలిసింది.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



పద్మావతమ్మ (ఫైల్)

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని మందరం పంచాయతీలోని రాచపల్లెకు చెందిన పద్మావతమ్మ (88) వడదెబ్బతో శనివారం మృతి చెందింది. ఈమె పట్టణంలోని నూనెవారిపల్లెలో పెద్దకుమారుడు వెలగచర్ల రామిరెడ్డి వద్ద ఉంటోంది. భానుడి వేడి తాళలేక వడదెబ్బ కారణంగా ఇంట్లోనే ఒక్కసారిగా ఊపిరాడక మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలియజేశారు.

కుప్పకూలిన గోడ



కుప్పకూలిన భవన సన్‌సైడ్ బండ

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలి సింగనమల వీధిలోని కోదండరామాలయం ముందు నిర్మాణంలో ఉన్న భవనం సన్‌సైడ్ గోడ శనివారం అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో అక్కడ ఉన్న రెండు ద్విచక్రవాహనాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ సందర్భంగా వాహనదారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

హరి హర క్షేత్రం.. పుష్పగిరి



పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రధాన గోపురం

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- ఈ నెల 9 న చందనోత్సవం, 10 న అక్షయ తృతీయ , 11 న కల్యాణోత్సవాలు, 12 న రథోత్సవాలు, 14న చక్రస్నానం, పుష్పయాగం



చెన్నకేశవస్వామి



వైద్యనాథేశ్వరస్వామి

వల్లూరు: జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన పుణ్య క్షేత్రాలలో పుష్పగిరి ఒకటి. వల్లూరు మండలంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి చరిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. శివ స్వరూపుడైన వైద్యనాథేశ్వరునికి ,విష్ణు స్వరూపుడైన చెన్న కేశవునికి నిలయమైన ఈ క్షేత్రం హరి హర క్షేత్రమై శివ కేశవుల మధ్య అభేదానికి ప్రతీకగా నిలుస్తోంది. భాస్కర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పుష్పగిరిలోని వైద్యనాథస్వామి ఆలయాన్ని చోళుల కాలంలోను, చెన్నకేశవ స్వామి ఆలయాన్ని చాళుక్యుల కాలంలోనూ నిర్మించారని చరిత్రకారుల అభిప్రాయం.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

సాధారణంగా శైవ క్షేత్రాలలో ఐదు రోజులు, విష్ణు క్షేత్రాలలో తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం పరిపాటి. కానీ పుష్పగిరిలో శివ కేశవులిద్దరికీ 9 దినాల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి కార్యక్రమంలోనూ సాక్షాత్తు శ్రీరామ చంద్రునిచే పూజలందుకున్న శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామికి ముందుగా పూజలు నిర్వహించి, అనంతరం శ్రీ లక్ష్మీ చెన్న కేశవునికి పూజలు నిర్వహిస్తారు. ఈ నెల 5 వ తేదీ నుండి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలలో 9 వ తేదీన జరిగే చందనోత్సవానికి, 10 న అక్షతదియలో భాగంగా జరిగే గరుడవాహన సేవకు, 11 న జరిగే రెండు కళ్యాణోత్సవాలకు , 12 న జరిగే రెండు రథోత్సవాలకు , బ్రహ్మోత్సవాల ముగింపు రోజైన 14 వ తేదీన జరిగే చక్రస్నానం, పుష్పయాగాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ దినాలలో భారీ సంఖ్యలో భక్తులు రాష్ట్రం నలుమూలల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా తరలి వస్తారు.

- శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరునికి ఈ నెల 5 న సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, ప్రధాన అర్చకుడు పి. అఖిల్ దీక్షితులు తెలిపారు. 6 న ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చన, అగ్ని ప్రతిష్టాపన, నవ కళశ స్థాపన, ధ్వజారోహణం జరుగుతాయి. సాయంత్రం హంస వాహన సేవ ఉంటుంది. 7 న అభిషేకాలు, కుంకుమార్చన , సాయంత్రం సింహవాహన సేవ ఉంటుంది. 8 న కుంకుమార్చన, నిత్య హోమం జరుగుతాయి. సాయంత్రం పురుషాన్ మృగ వాహన సేవ నిర్వహిస్తారు. 9 న సాయంత్రం మయూర వాహన సేవ, 10 న అక్షయ తృతీయ, రాత్రి నంది వాహన సేవ ఉంటుంది. 11 న ఉదయం 10 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథులకు కళ్యాణోత్సవం జరుగుతుంది. రాత్రి గజవాహన సేవ జరుగుతుంది. 12 న ఉదయం 10 గంటలకు వైద్యనాథ స్వామి రథోత్సవం, 13 న సాయంత్రం అశ్వవాహన సేవ , 14 న త్రిశూల స్నానం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం రావణేశ్వర వాహన సేవ జరుగుతాయి.
- శ్రీ లక్ష్మీచెన్న కేశవ స్వాములకు 5 న విష్వక్సేన పూజ, మేదినీ పూజ, అంకురార్పణ జరుగుతాయి. 6 న ఉదయం తోమాల సేవ, రాత్రి విశ్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, అగ్ని ప్రతిష్టాపనం, నవ కళశ స్థాపన, నవ కుంభారోహణ, ధ్వజారోహణం, భేరీ పూజ, పంచ సూక్త హోమం జరుగుతాయి. రాత్రి తిరుచ్చి వాహన సేవ ఉంటుంది. 7 న రాత్రి హంస వాహన సేవ , 8 న ఉదయం అష్టోత్తర కళశాభిషేకం , రాత్రి యాళీ వాహన సేవ ఉంటుంది. 9 న ఉదయం స్వామి వారికి చందనోత్సవం, రాత్రి హనుమంత వాహన సేవ, 10 న అక్షయ తదియ రోజు ఉదయం పూలంగి సేవ, రాత్రి 11.30 గంటల నుంచి గరుడ వాహన సేవ ఉంటుంది. 11 న ఉదయం పంచామృత స్నపన తిరుమంజనం, సాయంత్రం 7 గంటలకు శ్రీ దేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కళ్యాణం జరుగుతుంది. రాత్రి గజ వాహన సేవ నిర్వహిస్తారు. 12 న సాయంత్రం 4.30 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్న కేశవస్వామి రథోత్సవం జరుగుతుంది. 13 న రాత్రి అశ్వవాహన సేవ, 14 న తీర్థవాసి చక్ర స్నానం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం, సాయంత్రం 4.30 గంటలకు పుష్పయాగం, 7 గంటల నుంచి తిరుచ్చి వాహన సేవ జరుగుతాయి.

భవిష్యత్తు అంతా టెక్నాలజీదే



మాట్లాడుతున్న రీతు శర్మ

కురబలకోట : టెక్నాలజీపై పట్టున్న వారిదే భవిష్యత్తు అని కొత్త నైపుణ్యాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని బెంగళూరు బ్రిల్లియో టెక్నాలజీస్ మోటివేటర్ రీతు శర్మ అన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటింగ్, ఇంటిలిజెంట్ సిస్టమ్స్‌పై రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ టెక్నాలజీ నానాటికి కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. మారుతున్న కాలంతో పాటు సమాజంలో ఆలోచనలు, అవసరాలు, మార్పులు అనివార్యమన్నారు. కంపెనీలు, సంస్థలకు ఉద్యోగులు పెద్ద సంపద అన్నారు. వృత్తిలో, పనితీరులో, సంస్థలో గాని మారుతున్న కాలనుగుణంగా టెక్నాలజీపై పట్టు సాధిస్తే మెరుగ్గా మనుగడ సాగించవచ్చన్నారు. ఎంత టాలెంట్ ఉన్నా నైపుణ్యాలు లేకపోతే వెనుకబడి పోతారన్నారు. కొత్తవారు ముందుకు దూసుకు వస్తారన్నారు. గుర్తింపు, అవకాశాలు, అభివృద్ధికి నిరంతరం కొత్త వాటిని నేర్చుకుంటూ ఉండాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లర్నింగ్‌పై పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. నూతన టెక్నాలజీలజీస్‌పై ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ యుగం నడుస్తోందన్నారు. ఒకప్పుడు ఊహాత్మకంగా సినిమాల్లో చూపించినవి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో నిజ జీవితంలోకి వచ్చేస్తున్నాయన్నారు. వివిధ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. శరవేగంగా ఇది అన్ని రంగాలకు విస్తరిస్తోందన్నారు. భవిష్యత్ తరాలను ఇది మరింత ప్రభావితం చేయనుందని వివరించారు.

బాకీ తీర్చమన్నందుకు కత్తితో దాడి

నిమ్మనపల్లె : బాకీ తీర్చమన్నందుకు ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన సంఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లెకు చెందిన గంగాద్రి భార్య కొండ సముద్రం శిరీష (25), ముస్టూరు పంచాయతీ పారాసువారిపల్లెకు చెందిన రాజుకు కొంత నగదు అప్పుగా ఇచ్చింది. బాకీ తీర్చమని ఇటీవల పలుమార్లు అడిగింది. దీంతో రాజు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం శిరీష తన చెల్లెలు అయిన శ్రావణి, స్నేహితులైన మన్సూర్‌తో కలసి ద్విచక్ర వాహనంలో తవళంకు వెళుతుండగా, మార్గమధ్యమంలోని చల్లా వారి పల్లె వద్ద, రాజు ద్విచక్ర వాహనాన్ని అటకాయించి వారిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో శిరీష తీవ్రంగా గాయపడగా వానపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

నేడు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి : పీఓ, ఏపీఓ, మైక్రో అబ్జర్వర్లకు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందని, అలాగే పోలీసుశాఖ 33 అత్యవసర సేవల ఉద్యోగులకు సోమవారం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ తెలిపారు. జిల్లాలో ఓటు హక్కు ఉన్న పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్లుగా ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులు ఈనెల 5వ నుంచి 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారి స్థానిక నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోచవ్చని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో కాకుండా ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్లు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా కేంద్రమైన రాయచోటిలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా ఫెసిలిటేషన్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే ఇతర జిల్లాలకు చెందిన పోలీసుశాఖతో పాటు 33 అత్యవసర సేవల ఉద్యోగులు ఈనెల 6వ తేదీ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఎవరైనా 5వ తేదీ పోస్టల్ బ్యాలెట్ ఓటును ఉపయోగించుకోలేని వారు 6వ తేదీ తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలు ఇవే..

రాజంపేట నియోజకవర్గానికి చెందిన వారికి వత్తలూరు రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, రైల్వేకోడూరు నియోజకవర్గం వారికి తహశీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న హెచ్ఎంఎం హైస్కూల్‌లో, రాయచోటి నియోజకవర్గానికి చెందిన వారికి ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ప్రభుత్వ డైట్ హైస్కూల్‌లో, తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన వారికి జిల్లా పరిషత్ హైస్కూల్ అంగళ్ళు, కురబలకోట మండలంలో, పీలేరు నియోజకవర్గానికి చెందిన వారికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మదనపల్లె నియోజకవర్గానికి చెందిన వారికి బీటీ ప్రభుత్వ కళాశాలలో ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోచవ్చని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఎన్నికల విధుల అపాయింట్‌మెంట్ ఆర్డర్, ఓటరు ఐడీకార్డు, ఆధార్ కార్డు తీసుకు వెళ్లాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికల జోరు



రాంనగర్‌లో వైఎస్సార్‌సీపీలో చేరిన బలిజయువకులు,మహిళలు



ఆకేపాటి సమక్షంలో చేరిన వడ్డెర జిల్లా సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, వడ్డెరనేతలు



ఓబులవారిపల్లె కేంద్రంలో కాపునాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



చిన్నఓరంపాడు టీడీపీ కమ్మ సామాజిక వర్గం నాయకులకుపార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ,ఎమ్మెల్యే



వైఎస్ఆర్‌సీపీలో చేరినవారితో మేడా మధుసూదన్‌రెడ్డి, ఆకేపాటి సాయి భరత్‌రెడ్డి

రాజంపేట : కాపు(బలిజ)ల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేశారని రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్‌లో కాపు సామాజిక వర్గం సంబటూరు శ్రీనివాసులు, మట్లి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో 50 మంది యువకులు, మహిళలు వైఎస్సార్‌సీపీకి మద్దతు నిచ్చారు. వీరికి చైర్మన్ పోలా కండువాలను కప్పి, పార్టీలో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో బలిజల సంక్షేమానికి ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి కృషిచేశారన్నారు. కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసి తద్వారా ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. టీడీపీ, జనసేన మాటలకు బలిజలు మోసపోరన్నారు. రాజంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనరు కృష్ణరావు యాదవ్, కౌన్సిలర్స్ తంబా సుబ్రమణ్యం, విష్ణువర్ధన్, చలపతిగౌడ్, గోవిందుబాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పేదవర్గాలు అధికంగా నివసించే రాంనగల్‌లో పోలా చేపట్టిన ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన లభించింది.

వైఎస్సార్‌సీపీలోకి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు

రాజంపేట రూరల్ / సుండుపల్లె(రాజంపేట) : టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు బత్తల శ్రీరాములు తన అనుచరులు, వడ్డెరలతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్ రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అంతకుముందు వారు బత్తల శ్రీరాములుకు ఏపీఐఐసీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి సోదరుడు అనిల్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలు కొనసాగలన్నదే తమ ఆశయమన్నారు. రాష్ట్రం సుభిక్షితంగా ఉండాలంటే జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికల జోరు

ఓబులవారిపల్లె: మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో వైఎస్సార్ పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. మండల కేంద్రంలోని కటికంవారి పల్లె గ్రామానికి చెందిన పది కుటుంబాలు మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి అధ్వర్యంలో కాపు నాయకులు అరిగెల సుబ్బారాయుడు, అవులూరు ఈశ్వరయ్య, గబ్బి వెంకటేష్, అంకన ఈశ్వరయ్య, అరిగేల సుబ్రమణ్యం, కటికం వెంకటసుబ్బయ్య పది కుటుంబలవారిని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వైఎస్సార్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చిన్నఓరంపాడు మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కోమ్మిన పెంచలయ్య నాయుడు, పిడికెడు వెంకటసుబ్బయ్య నాయుడు, మన్యం విశ్వనాథ్‌నాయుడు చేరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సర్పంచ్ ఎస్‌పీ జయపాల్‌రెడ్డి ,సీనియర్ నాయకులు సింతు సుదర్శన్‌రెడ్డి, పున్నటి కృష్ణరెడ్డి, చొడవరం గంగిరెడ్డి, యువనాయకు ఓడి అమర్‌నాథ్‌రెడ్డి, గంగన్నగారి పవన్, ఓజీ అనిల్ కూమార్‌రెడ్డి, గోపి,నిఖిల్,మందరం చంద్రరెడ్డి, ఓజీ జయప్రకాష్‌రెడ్డి, పున్నటి సుబ్రమణ్యంరెడ్డి,ఎసీ మండల కన్వీనర్ బీర్ ప్రెమ్ తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లెలో 25 కుటుంబాలు చేరిక

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిదిలోని శివునిపల్లె గ్రామంలో శనివారం రాత్రి రాజంపేట వైఎస్ఆర్‌సీపీ నాయకుడు మేడా మధుసూదన్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తనయుడు ఆకేపాటి సాయి భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో శివునిపల్లె గ్రామానికి చెందిన 25 కుటుంబాలు టీడీపీ నుంచి వైస్ఆర్‌సీపీలో చేరాయి. ఈ మేరకు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్ఆర్‌సీపీలో చేరిన వారిలో దాసరి పెద్ద అనుపుల్లయ్య, దారిపాల అనుపుల్లయ్య, దాసరి చిన్నయ్య, నడిపి అనుపుల్లయ్య, చిట్టిబోయిన వెంకటసుబ్బయ్య, గోపినేని రెడ్డెయ్య, చువ్వల తిరుపాల్ వీరితోపాటుగా వీరి అనుచరులు 25 యాదవ వర్గానికి చెందిన కుటుంబాలు చేరాయి. రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. సుబ్బయ్య, మచ్చా సుబ్బరాయుడు, దాసరి అనుపుల్లయ్య, యూత్ కన్వీనర్ వావిళ్ల శ్రీనివాసుల రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకట్, కాడె వెంకటరమణ, ఏకుల రామిరెడ్డి, రావుల సుబ్బారెడ్డి, ఎం .సుబ్బారెడ్డి, రాజారెడ్డి, చిన్న మల్లారెడ్డి, ప్రదీప్‌సాగర్ పాల్గొన్నారు.

పింఛన్ కోసం తిరిగి ‘తిరిగి’రాని లోకాలకు..

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ నారాయణరాజుపేట గ్రామానికి చెందిన నాయనపల్లి చిన్నక్క (70) అనే వృద్ధురాలు శనివారం వడదెబ్బతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. చిన్నక్క కుమారుడి ఇంట్లో ఉంటోంది. ప్రభుత్వం ఈ నెల పింఛన్ సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఈనేపథ్యంలో శుక్రవారం చిన్నక్క పింఛన్ కోసం తనకు ఖాతా ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుకు వెళ్లగా అక్కడ పెన్షన్ పడలేదని, పింఛన్ డబ్బులు ఐసీఐసీఐ బ్యాంకులో పడి ఉండచ్చు అని గ్రామీణ బ్యాంకు సిబ్బంది తెలపడంతో ఆమె ఐసీఐసీఐ బ్యాంకుకు వెళ్లింది. అక్కడ కూడా పింఛన్ డబ్బు పడలేదని తెలుసుకొని కెనరా బ్యాంకు వెళ్లింది. అక్కడ కూడా నిరాశ ఎదురయ్యింది. దీంతో తీవ్ర ఎండలకు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ వడదెబ్బకు గురై శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గడికోట వెంకటసుబ్బారెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన సోదరుడు భూమన శివశంకర్‌రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డిలు మృతదేహం వద్ద నివాళి అర్పించి దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం అందజేశారు.

యువకుడి అనుమానాస్పద మృతి

మదనపల్లె: ఓ యువకుడు ఉరి వేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లి మండలంలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి మండలం, పాతపాలెం శివపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు (28)కు పదేళ్ల క్రితమే తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో నాలుగేళ్ల క్రితం ఉపాధి కోసం మదనపల్లె మండలం పోతబోలు పంచాయితీ పెద్ద చెన్నయ్య గారి పల్లెకు వచ్చాడు. స్థానికుడైన సాఫ్ట్వేర్ ఉద్యోగి ఆలూరి మోహన్‌కు చెందిన ట్రాక్టర్ కు డ్రైవర్‌గా పనికి కుదిరాడు. ట్రాక్టర్ యజమాని మోహన్ బెంగళూరులో ఉద్యోగ నిమిత్తం ఉంటున్నాడు. కొద్దికాలంగా శ్రీనివాసులు ట్రాక్టర్ బాడుగల ద్వారా వచ్చిన నగదుతో జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం టమోటా పొలం వద్ద ఉన్న రేకుల షెడ్డులో ఉరి వేసుకుని మృతి చెందాడు. గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని బంధువు భాస్కర్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

మదనపల్లె: హత్యాయత్నం కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు టూ టౌన్ సిఐ యువరాజు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలంలోని కొండా మర్రి పల్లె పంచాయతీ టీఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న నరసారెడ్డి గారి వెంకటరమణారెడ్డి అలియాస్ రమణారెడ్డి (60)కి , మదనపల్లి పట్టణం శివాజీ నగర్ లో నివాసం ఉంటున్న తన తమ్ముడు నరసా రెడ్డి గారి శ్రీనివాసులు రెడ్డితో కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. తట్టివారిపల్లె జంక్షన్ వద్ద ఉన్న 10 కుంటల స్థలం, శివాజీ నగర్ లోని ఇంటి విషయంలో ఇద్దరి మధ్య తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈనెల 1వ తేదీ మధ్యాహ్నం పట్టపగలే వెంకటరమణారెడ్డి అలియాస్ రమణారెడ్డి తన కొడుకు ఎస్ మనోజ్ కుమార్ రెడ్డి (32), తో కలిసి స్కూటీలో శివాజీ నగర్ లోని తమ్ముడైన శ్రీనివాసులురెడ్డి ఇంటికి వెళ్లి, పథకం ప్రకారం అక స్మాత్తుగా అతనిపై కత్తులతో దాడి చేశారు.దీంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు ప్రభు త్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసికి తరలించారు. ఈ కేసులో నిందితులు ఇద్దరు శనివారం తట్టివారిపల్లె జంక్షన్ తిరుపతి రోడ్డు వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.